క్లుప్తంగా

మద్యం బార్లలో ఆకస్మిక తనిఖీ



మద్యం నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా ప్రొహిబిషన్ అధికారి నాగేశ్వరరావు

ఆదోని అర్బన్: పట్టణంలోని మద్యం బార్లను మంగళవారం జిల్లా ప్రొహిబిషన్ అధికారి నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక మధురిమ, రెడ్‌చిల్, దీప్తి బార్‌లను తనిఖీ చేశారు. బార్‌లలో మద్యం నాణ్యతను పరిశీలించారు. అలాగే రికార్డులను, మద్యం స్టాకును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీలో భాగంగా పట్టణంలో మూడు బార్‌లను తనిఖీ చేశామని, బార్‌లలో ఎలాంటి నాణ్యత లోపంలేదని, అన్నీ సక్రమంగా ఉన్నాయని తెలియజేశారు. ఈయనతో పాటు సీఐ, సిబ్బంది పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యంలో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి మొమెంటో అందజేస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: గత నెలలో ముంబాయి రవీంద్రనాథ్ నాట్య మందిరంలో జరిగిన కూచిపుడి పోటీల్లో పట్టణానికి చెందిన మిల్టన్ పాఠశాల విద్యార్థి రూపాల్ సాయిశ్రీ జాతీయ స్థాయిలో మొదటిస్థానంలో నిలిచింది. ఈ మేరకు ఆ పాఠశాల కరస్పాండెంట్ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ మోహన్, సీఈఓ వెంకటేష్ విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొన్న పోటీలో తమ పాఠశాల విద్యార్థి మొదటిస్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు నాగరాజు, సుశీల, జయసింహా పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంటీఎఫ్ నాయకులు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎంటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉపాధ్యాయుల డీడీఓ మల్లికార్జున, ఎస్ఎంహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎం అలీం సిద్ధిఖీ, ఉపాధ్యాయులు పాల్గొని క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాలెండర్‌లో సెలవులు, తిథి, మంచి, చెడు ముహూర్తాలు తదితర ముఖ్యమైనవి ఉన్నాయన్నారు. అనంతరం సావిత్రిబాయి జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో పద్మావతమ్మ, రాధ, పద్మాభాయి, ముంతాజ్‌బేగం, కోమలి, నీలిమ, సురేష్‌కుమార్, ప్రతాప్, బసవరాజ్, కోటన్న, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



బుడగ జంగాల కాలనీలో బోరును ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రంలోని 9 వార్డు బుడగ జంగాల కాలనీలో నీటి సమస్యకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో గ్రామ సర్పంచ్ పాల్‌దినకర్ పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా మంగళవారం పాలదినకర్ మాట్లాడుతూ బుడగ జంగాల కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో కాలనీ వాసులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. సమస్యను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లి ఆయన సహకారంతో బోరును వేయించి మోటార్ ఏర్పాటు చేసి నీటి సరఫరా కొనసాగేలా చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు.

వ్యక్తిపై దున్నపోతు దాడి

హొళగుంద: మండల కేంద్రానికి చెందిన పశువుల యజమాని వీరేశ్‌పై మంగళవారం దున్నపోతు దాడి చేయడంతో గాయాలపాలయ్యాడు. సాయంత్రం సినిమా రోడ్డులో గేదెతో దున్నపోతు వద్దకు వెళ్లగా అది ఉన్నట్టుండి వీరేశ్‌పై దాడి చేసింది. క్షతగాత్రుడిని స్థానికులు ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు.

నిత్యాన్నదానం ప్రారంభం

వెల్దుర్తి: స్థానిక జర్నలిస్ట్ కాలనీలో వెలసిన శ్రీలక్ష్మీవేంకటేశ్వర సాయినాథ అయ్యప్ప కేదారేశ్వరస్వామి ఆలయ సమూహంలో నిత్యాన్నదా కార్యక్రమాన్ని మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధులు సుదర్శన్‌రెడ్డి, శ్రీధర్‌శర్మ, గోపినాథ్, చిరంజీవి, మధు ప్రారంభించారు. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు అన్నదానం ఉంటుందని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి
- భూరక్ష పథకం ద్వారా రైతులకు న్యాయం
- తొలగనున్న వివాదాలు



రైతులకు భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, అధికారులు

ఆదోని రూరల్: బ్రిటీష్ కాలం నుంచి ఎప్పుడూ లేనివిధంగా రైతులు, ప్రజలకు సంబంధించిన భూములను అత్యాధునిక పద్ధతుల ద్వారా కొలతలు వేసి భూ వివాదాలు పరిష్కరించడంతో పాటు హక్కు పత్రాలు అందించడం చరిత్రాత్మకమని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్ష' పథకంలో భాగంగా మంగళవారం నారాయణపురం గ్రామంలో భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భూ యజమానులకు హక్కు పత్రాలను అందజేసి మాట్లాడారు. బ్రిటీష్ కాలం నుంచి భూముల సర్వే జరగలేదని, ప్రస్తుతం రీసర్వే ద్వారా సంబంధిత వ్యక్తులకు ఎంత భూమి ఉందనే వివరాలు తేల్చి, ఎలాంటి వివాదాలు లేకుండా హక్కు పత్రాలను అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. చాలా మంది భూ వివాదాల్లో గొడవలు పడి పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, అలాంటి పరిస్థితి లేకుండా ప్రభుత్వం ప్రతిఒక్క రైతుకు సంబంధించి ఎంత భూమి ఉందో రీసర్వే ద్వారా నిర్ధారిస్తుందన్నారు. నారాయణపురం, చాగి గ్రామాలు 2009 కన్నా ముందు ఆలూరు నియోజకవర్గంలో ఉండేవని, ఈ గ్రామాలను ఆదోని నియోజకవర్గంలో కలపారని గుర్తుచేశారు. ఈ గ్రామాల అభివృద్ధికి ఇప్పటివరకు రూ.74 లక్షలు ఖర్చు చేసినట్లు వివరించారు. డ్రెయిన్లు, పైపులైన్లు పూర్తి చేశామని, తాగునీటి కోసం ఆయా కాలనీల్లో పైపులైన్‌లను ఏర్పాటు చేసి త్వరలో ప్రతిఒక్కరికీ తాగునీరు అందేవిధంగా చేస్తామన్నారు. వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఆర్ఐ జయరామిరెడ్డి, గ్రామ సర్పంచ్ పురుషోత్తంరెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

బీసీ హక్కుల పోరాట సమితిని బలోపేతం చేద్దాం

కర్నూలు(అర్బన్): జిల్లాలో బీసీ హక్కుల పోరాట సమితిని బలోపేతం చేసేందుకు కృషి చేద్దామని సమితి రాష్ట్ర అధ్యక్షులు జీ అయ్యన్నయాదవ్, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ధనుంజయ ఆచారి పిలుపునిచ్చారు. మంగళవారం సావిత్రీబాయి పూలే 191వ జయంతి సందర్భంగా స్థానిక బీసీ భవన్‌లో పోరాట సమితి జిల్లా అధ్యక్షులుగా జీ రమేష్‌యాదవ్‌ను ఎన్నుకొని నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోరాట సమితిని విస్తృత పరిచేందుకు త్వరలో జిల్లాలోని అన్ని నియోజక వర్గాలు, మండలాలు, పట్టణాల్లో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. నూతన అధ్యక్షుడు రమేష్‌యాదవ్ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను తూచ తప్పకుండా నెరవేరుస్తానన్నారు. కార్యక్రమంలో నేతలు హుసేనప్పయాదవ్, ధన విజయుడు, టీజీ శ్రీనివాసులు, క్రిష్టోజీరావు, శ్రీరాములు, విజయలక్ష్మి, శ్రీకాంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పింఛను సొమ్ము పెంపుపై హర్షం



ఆదోని 39వ వార్డులో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అవ్వాతాతలు



వృద్ధురాలు శరవమ్మకు పింఛను పంపిణీ చేస్తున్న వలంటీర్ షమీర్

ఆదోని అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మరోసారి పింఛను సొమ్మును రూ.250 పెంచి నూతన సంవత్సరం కానుకగా అందజేశారు. వలంటీర్లు వేకువజామునే లబ్ధిదారుల తలుపు తట్టి రూ.2750 చొప్పున పింఛన్లను అందజేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక 39వ వార్డు నిజాముద్దీన్ కాలనీలో అవ్వ, తాతలు పింఛన్ సొమ్ము పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆ కాలనీ కౌన్సిలర్ ఫయాజ్, వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నవరత్నాలను అవ్వతాతలకు వివరించారు.

కౌతాళం: పింఛన్ డబ్బులు పెంచడంపై లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని బాపురం గ్రామ నాయకుడు గురునాథ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ శిల్పారెడ్డి అన్నారు. మంగళవారం కొత్త పింఛన్ లబ్ధిదారులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాపురం గ్రామ పరిధిలోని బాపురం, దంబలదిన్నె, వీరాలదిన్నె గ్రామాలకు కలిపి 11 పింఛన్లు కొత్తగా మంజూరయ్యాయని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ పింఛను సొమ్ము రూ.2,750కు పెంచడంతో మహిళలకు ఆర్థిక భరోసా కలిగిందన్నారు. నాయకులు, శ్రీనివాసరరెడ్డి, పామిరెడ్డి, రాఘవరెడ్డి, జైపాల్, కుమార్‌గౌడ్, వీరేష్, ఆచారి పలువురు పాల్గొన్నారు.

రాయచూరుకు వెళ్లి పింఛన్ పంపిణీ

ఆదోని రూరల్: మండలంలోని ఢణాపురం క్లస్టర్-6లో పనిచేస్తున్న వలంటీర్ షమీర్ మంగళవారం రాయచూరుకు వెళ్లి అనారోగ్య కారణంగా అక్కడ చికిత్స పొందుతున్న శరవమ్మ అనే వృద్ధురాలికి పింఛన్ అందజేశాడు. ఆ వృద్ధురాలు వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

మహిళాభ్యున్నతికి పూలే కృషి ఎనలేనిది





ఆదోనిలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం, పెద్దకడబూరు కస్తూర్బా పాఠశాలలో సావిత్రిబాయి పూలే వేషధారణలో ప్రసంగిస్తున్న విద్యార్థిని

ఆదోని అర్బన్: సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మంగళవారం ఆయా రాజకీయ పార్టీలు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి మహిళా అభ్యున్నతి చేసిన సేవలను కొనియాడారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్, పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళల విద్య కోసం ఎంతగానో కృషి చేశారని, వారిని అన్ని విధాలుగా చైతన్యవంతుల్ని చేశారని కొనియాడారు. విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందని నిరూపించిందన్నారు. వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, ఉస్మాన్, సిద్ధ, మల్లికార్జున, రామక్రిష్ణ, మలేకర్ గోవిందు, తారనాథ్, ప్రసాద్, నరసన్న, తాయన్న, వెంకటేష్, లాల్‌బాషా, మహబూబ్, రాందాసు, పంపారెడ్డి, హరిదాసు తదితరులు పాల్గొన్నారు.

- రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ (ఆర్‌పీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాలలో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాలు, డివిజన్ అధ్యక్షులు వైష్ణవి పాల్గొని మాట్లాడారు. నాయకులు పుష్ప, నిఖిత, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

- బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు ఆధ్వర్యంలో స్థానిక బీమాస్ హోటల్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు శేషన్న, మల్లేశ్వరప్ప, వీరేష్, యల్లప్ప, రామక్రిష్ణ, తాయన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను మండల పరిధిలోని చిన్న కడబూరు ప్రాథమిక పాఠశాల, కస్తూర్బా గురుకుల పాఠశాల జనవిజ్ఞాన వేదిక, యుటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి గొప్పతనాన్ని స్మరించుకున్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కే.శంకరయ్య, యుటీఎఫ్ జిల్లా నాయకుడు కొలన్న మాట్లాడుతూ విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమన్నారు. బాలికల విద్య, మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం సమగ్రాభివృద్ధి చెందుతుందన్నారు. యుటీఎఫ్ నాయకులు ప్రసాద్, శివశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పల్లెపాడు పాఠశాలలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోసిగి: మండలంలోని కోసిగి, పల్లెపాడు, సాతనూరు పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. పల్లెపాడు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వీరేష్, కోసిగి బాలికల పాఠశాలలో హెచ్‌ఎం నీలకంఠ, సాతనూరు పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు వీరేష్ ఆధ్వర్యంలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, స్త్రీ విద్య కోసం శ్రమించిన ఉద్యమ కిరీటి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటి మహిళా పాఠశాలను ప్రారంభించారని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు భాస్కర్, లావణ్య, శ్రీనివాసులు, హసీనా, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

షాదీఖాన నిర్మాణానికి మోక్షం



షాదీఖాన భవనం నిర్మాణానికి సిద్ధం చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పెద్దకడబూరు: మండల కేంద్రంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన షాదీఖాన భవనానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. దాదాపుగా 20 ఏళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వంలో షాదీఖాన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నిధులు అందక కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులను నిలిపివేశారు. అప్పటి నుంచి కష్టాలు మొదలయ్యాయి. ఎన్నికల ముందు ఓట్లు అడగడానికి వచ్చిన ప్రతి నాయకుడు తాము అధికారంలోకి వస్తే షాదీఖాన నిర్మించి ఇస్తామనడం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖం చాటేయడం పరిపాటిగా మారింది. అయితే గత ఎన్నికల ముందు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తాము అధికారంలోకి వస్తే ముస్లిం మైనార్టీల కలను సాకారం చేస్తానని హామీ ఇచ్చారు. మండల ముస్లిం నాయకులు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా వారి ద్వారా ఎమ్మెల్యే విషయం తెలుసుకుని ప్రభుత్వం నుంచి షాదీఖాన నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరు చేయించారు. దీంతో షాదీఖాన పనులు ప్రారంభం అయ్యాయి. త్వరలోనే భూమిపూజ, ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టనున్నారు. అందులో భాగంగానే వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి మంగళవారం షాదీఖాన చుట్టూ పెరిగిన ముళ్ల కంపలను తొలగించి ఆవరణం చుట్టూ గ్రావెల్‌తో నింపి సిద్ధం చేయిస్తున్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని రచ్చుమర్రి సచివాలయం-2 పరిధిలో 3వ రోజు బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి. వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి హాజరుకానున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. స్థానిక నాయకులు, అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

కేసీఆర్ కుట్రలకు కాలం చెల్లింది

ఆదోని అర్బన్: బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు, కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న మండిపడ్డారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విభజన హామీల్లో భాగంగా ఏపీకు రావాల్సిన బకాయిలను ఇవ్వకుండా హేళనగా మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న ఏపీ వాసులను తరిమికొట్టండి అని చెప్పిన కేసీఆర్ నేడు ఏ ముఖం పెట్టుకొని ఏపీ వాసులను ఓట్లు అడిగేందుకు వస్తున్నారని దుయ్యబట్టారు. న్యాయపరంగా ఏపీకి రావాల్సిన వాటిని కూడా దక్కకుండా అడ్డుపడుతూ ప్రస్తుతం బీఆర్ఎస్ పేరుతో కుటిల రాజకీయాలు చేయాలని చూస్తే ఊరుకోమన్నారు. కేసీఆర్ కుట్రలకు కాలం చెల్లిందని, దేశ రాజకీయాల్లో చక్రం తిప్పాలనే ఆయన రాజకీయ దురుద్దేశం ప్రజలందరికీ తెలుసని తేల్చి చెప్పారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయ బృందం

కోసిగి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ అడివన్న, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం నీలకంఠ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఎస్టీయూ ఎనలేని కృషి చేస్తోందన్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి 10వ తరగతి ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించాలని ఎంపీడీఓ ఉపాధ్యాయులకు సూచించారు. ఎస్టీయూ జిల్లా కౌన్సిలర్లు సుధాకర్, ఎర్రిస్వామి, రామాంజులు, మండల బాధ్యులు ప్రభాకర్, సురేంద్ర, ప్రభుదాస్, ఆనంద రావు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు



బోరు నుంచి వస్తున్న నీరు

కోసిగి: మండల పరిధిలోని ఐరన్‌గల్లు గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్ రెడ్డి సహకారంతో తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. మంగళవారం గ్రామ సర్పంచ్ రామాంజినేయులు పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన బోరుకు కొత్త మోటార్‌ను అమర్చి గ్రామంలోకి నీటి సరఫరా చేశారు. గ్రామంలో పాత బోర్లు మరమ్మతులకు గురై తాగు నీటి సరఫరా తగ్గిపోయింది. సమస్య తీవ్ర రూపం దాల్చక మునుపే బోరు వేయించి తాగునీటి సరఫరా ప్రారంభించడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు, మండల ఇన్‌చార్జ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఖాతాదారుల సమస్యలు పరిష్కరించండి



బ్యాంకు సిబ్బందికి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు తిక్కన్న, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు పరమేష్ డిమాండ్ చేశారు. గ్రామీణ బ్యాంక్‌లో ఏటీఎం సెంటర్ ఏర్పాటు, సిబ్బంది కొరత తీర్చాలంటూ బ్యాంకు సిబ్బందికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ బ్యాంకులో సుమారు 18 వేల మంది ఖాతాదారులు ఉన్నారన్నారు. ప్రతిరోజూ 300 మందికి పైగా ఖాతాదారులు లావాదేవీల నిమిత్తం బ్యాంకు వస్తుంటారన్నారు. సిబ్బంది కొరతతో సకాలంలో సేవలందించకపోవడంతో ఖాతాదారుల సమయం వృథా కావడంతో పాటు పలువురు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీంతోపాటు ఏటీఎం సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఖాతాదారుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని బ్యాంకు సిబ్బందిని పెంచడంతో పాటు రాత్రి సమయాల్లో సెక్యూరిటీని పెంచాలన్నారు. దళిత ఐక్యవేదిక నాయకుడు లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య

కౌతాళం: అకాల వర్షాలు, కల్తీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ఏకరానికి రూ. 60 వేలు నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులను ఆదుకోవాలని కోరుతూ ఈనెల 5న కర్నూలు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించ తలపెట్టినట్లు చెప్పారు. కర్నూలు, అనంతపురం, నంద్యాల జిల్లాల్లో కల్తీ పత్తి విత్తనాలు, అకాల వర్షాల వల్ల పత్తి, వరి, వేరుశనగ, ఉల్లి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, బాధిత రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండు చేశారు. రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఈరన్న, ఉలిగయ్య, వెంకన్న, వీరేష్, వలి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఆదోని అర్బన్: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో చదువుతున్న ఎన్‌సీసీ విద్యార్థి రవితేజ కర్నూలు గ్రూపు నుంచి ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో ఉన్న ఇండియన్ మిలటరీ అకాడమీ శిక్షణ పొందారు. పది రోజులపాటు డ్రిల్, మోటివేషన్, వివిధ ఆర్మీ బాధ్యతలపై శిక్షణ పొంది మంగళవారం ఆదోనికి తిరిగివచ్చారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ విట్టా సతీష్‌కుమార్, కరెస్పాండెంట్ దైవాధీనంరెడ్డి, ప్రిన్సిపాల్ మురళీమోహన్ రెడ్డి, ఎన్‌సీసీ అధికారి గోవిందు, ఎన్ఎస్ఎస్ అధికారి జొనాథన్ అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

5న వాహనాల వేలం

కోసిగి: సెబ్ సర్కిల్‌లోని కోసిగి, పెద్దకడబూరు మండలాల పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు ఈ నెల 5వ తేదీన కోసిగి సెబ్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సెబ్ సీఐ సుజన్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతేడాది నుంచి అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు రూ.3 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని 5వ తేదీ ఉదయం 10 గంటల్లోపు సెబ్ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు.

కనకవీడులో అగ్నిప్రమాదం

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో మంగళవారం విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వడ్డె రంగస్వామి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు రంగస్వామికి సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని తాళం పగులగొట్టి మంటలను అదుపు చేశారు. అప్పటికే 7 బస్తాల బియ్యం, రూ.70 వేలు నగదు, అర తులం బంగారం, దుస్తులు కాలిపోయాయని బాధితుడు తెలిపారు.

8న కబడ్డీ పోటీలు

కర్నూలు కల్చరల్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని విజ్ఞాన సేవా సమతి ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నగర శివారులోని జి.పుల్లారెడ్డి కళాశాల సమీపంలోని విజ్ఞాన పీఠంలో కబడ్డీ ఓపెన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రామిరెడ్డి, సురేష్ తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు ఈ నెల 7వ తేదీలోగా జట్టు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 96184 49289 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.